సాక్షి
వికారాబాద్
సోమవారం, 5, మే, 2025



రోడ్డు పనులు ప్రారంభం

గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. 10లో▸



నిబంధనలకు తూట్లు!

మండుటెండలకు ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస వసతులు లేక కూలీలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 11లో▸



విజయవంతం చేయాలి

వికారాబాద్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. 11లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణి వాయిదా

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు ఉండటంతో ప్రజావాణి కార్యక్రమం వాయిదా వేశామని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కేజీబీవీ ఎస్‌ఓ పల్లవిరెడ్డి



బంట్వారం: కోట్‌పల్లి కేజీబీవీలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ పల్లవి రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు కోట్‌పల్లి కేజీబీవీని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం మొదటగా రెండు కోర్సులు ప్రారంభించనున్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ(నర్సు ట్రైనింగ్), ఎంఎల్‌టీ(మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) కోర్సుల్లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి పాసైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 8328415565 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆమె సూచించారు.

ఘనంగా భగీరథ జయంతి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం మహర్షి భగీరథ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి ఉపేందర్, సహాయ అధికారులు భీంరాజ్, వసతి గృహ అధికారులు, పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయ్ దేవరకొండపై రాణాలో ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గిరిజన జాతిని అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు విజయ్‌దేవరకొండపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఐ దేవరాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో ఎంతో ఉన్నత విలువలు, సంస్కృతి, ఆచారాలను పాటిస్తున్న ఏకైక జాతి గిరిజన జాతి మాత్రమేనన్నారు. అలాంటి గిరిజనుల మనోభావాలు దెబ్బతినేలా సినీ హీరో విజయ్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం నాయకులు సంతోష్‌నాయక్, చందర్‌నాయక్, జర్పుల రాజునాయక్, బాబురాజ్‌నాయక్, పరశురాం నాయక్, శ్రీనివాస్, అంబాదాస్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

షాద్‌నగర్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది దివ్యాంగులు ఉన్నారని, వారు న్యాయమైన హక్కుల సాధనకు పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్‌ను మార్చాలని కోరారు. దివ్యాంగులపై వేధింపులు అధికమవుతున్నాయని, రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ మండలకేంద్రంలో భవిత కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రాజెక్టు పూర్తికాక.. వెతలు తీరక

కేపీ లక్ష్మీదేవిపల్లి డిజైన్ మార్పులతో కాలయాపన
- బడ్జెట్ సమావేశంలో రిజర్వాయర్ ప్రస్తావన
- సస్యశ్యామలం కానున్న 2,46,154 ఎకరాల భూమి
- త్వరితగతిన నిర్మించాలని అన్నదాతల వేడుకోలు

వికారాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా పరిస్థితి దీపం చుట్టూ చీకట్లే అన్న చందంగా తయారయింది. నగరానికి ఆమడ దూరంలో ఉన్నా అభివృద్ధిలో మాత్రం నత్తతో పోటీ పడుతోంది. దశాబ్దాలుగా పాలకుల అనాలోచితచర్యతో సరిపడా సాగు నీటి వనరులు లేకుండా పోయాయి. ఎన్నికల సమయంలో మాత్రం ఈ ప్రాంత రూపురేఖలు మార్చుతామనే నాయకుల వాగ్దానాలు నీటి మీది రాతలుగా మారాయి. జిల్లాకు వరప్రదాయినిగా భావించే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి చేయి చూపించింది. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించినప్పటికీ ప్రత్యేకంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రస్తావన అందులో లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేస్తామని గత బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రస్తావించింది. కానీ ఇప్పటివరకు ముందడుగు పడలేదు. గతంలోనే పరిగి నియోజకవర్గం సరిహద్దులో కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క బడ్జెట్‌లో పేర్కొన్నారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు

కల నెరవేరుతుందా?

జిల్లాకు చెందిన ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ ఏదో ఒక కొర్రీలు పెట్టి ప్రభుత్వాలు పక్కన పెడుతున్నారు. సర్వేలు, రీడిజైన్లు, కేసులు అంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకాన్ని దశాబ్దాలుగా కాలయాపన చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 50 టీఎంసీల కేటాయింపులున్న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో గత ప్రభుత్వం అటకెక్కించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కొన్నేళ్లుగా ఊగిసలాడుతూ వస్తోంది. అనేక సర్వేలతో డిజైన్లను మార్చుతూ వచ్చారు. పాలమూరు ఎత్తిపోతల విషయంలో పదేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే కోసం రూ.6.91 కోట్లు కేటాయించగా.. నిపుణులు సర్వే చేసి డిజైన్ వివరాలు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 115 టీఎంసీ నీటిని కేటాయించారు. అందులో 45 టీఎంసీల కెపాసిటీతో పరిగి నియోజకవర్గంలోనే రిజర్వాయర్లు కట్టేందుకు ప్రణాళిక చేశారు. ఇందులో గండేడ్, కుల్కచర్ల మండల పరిధిలో నిర్మించే రిజర్వాయర్ సామర్థ్యం 35 టీఎంసీలుగా పేర్కొన్నారు.

సీఎంపైనే ఆశలు

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన లక్ష్మీదేవిపల్లి, పరిగి మండల పరిధిలోని రావులపల్లి గ్రామాల శివారులో సంయుక్తంగా 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో జిల్లాకు 2,46,154 ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది. అయితే గత సర్కారు హయాంలో అనేక సార్లు రీడిజైన్ చేస్తూ వచ్చారు. చివరకు గ్రావిటి ద్వారానే నీళ్లు అందిస్తామని చెప్పి, అది కూడా పూర్తి చేయలేదు. ప్రధాన ప్రాజెక్టుల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవటానికే పరిమితమయ్యారు తప్పా పనులు పూర్తి చేయడంలో శ్రద్ధ చూపలేదు. జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిథ్యం వహిస్తుండడంతో ఈసారైనా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తారని ఆశగా రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



బడ్జెట్‌లోనే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని పేర్కొనడం శుభ పరిణామం. నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి నుంచి హామీ తీసుకున్నాం. రిజర్వాయర్ పూర్తయితే జిల్లా రైతాంగానికి ఎంతో మేలు. ఈ విషయాన్ని సీఎంతో పాటు ప్రభుత్వ పెద్దలు, సంబంధిత మంత్రితో చర్చిస్తున్నాం. సీఎం సైతం సానుకూలంగా ఉన్నారు. కచ్చితంగా ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మిస్తుంది.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి



బాలికల గురుకుల పాఠశాల కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

ప్రశాంతంగా నీట్ పరీక్ష



పరీక్ష కేంద్రం బయట పిల్లల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు



అభ్యర్థుల హాల్‌టికెట్ తనిఖీ చేస్తున్న సిబ్బంది

- కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్‌లో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల, సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల, కొత్తగడిలోని బాలికల గురుకుల, అనంతగిరిపల్లి సమీపంలోని బాలుర గురుకుల పాఠశాల సెంటర్లలో నిర్వహించారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు నిర్ణీత సమయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ఉండగా 11 గంటల నుంచే సెంటర్లలోకి అనుమతించారు. 1.30 గంటలకు గేట్ మూసివేశారు. మొత్తం 1193 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 39 మంది గైర్హాజరయ్యారు. 1154 మంది పరీక్ష రాశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే హాల్‌లోకి పంపించారు. పరీక్షకు పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కాగా సెంటర్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్‌డీఓ వాసుచంద్ర తనిఖీ చేసి పరీక్ష నిర్వహణపై ఆరా తీశారు.



పరీక్ష హాల్ నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు



కమ్మలు తీసేస్తున్న అభ్యర్థి

మండేకాలం.. పశువులు భద్రం

అప్రమత్తంగా ఉంటేనే మూగజీవాలు ఆరోగ్యం
- వేడి గాలులతో జాగ్రత్త
- పశు వైద్యుల సూచన

తాండూరు: పక్షం రోజులుగా ఎండలతో పాటు వేడి గాలులు జన జీవనంతో పాటు పశువులను ఊపిరాడకుండా చేసున్నాయి. వేడి ఎక్కువైన ప్రజలు ఫ్యాన్ లేదా కూలర్లతో సేదదీరుతారు. మరీ ఇబ్బంది పడితే ఏసీలో చల్లగా గడిపేస్తారు. కానీ పశువులు మాత్రం మండే ఎండలకు అనారోగ్యబారిన పడుతున్నాయి. వాటిని పోషకులే దగ్గరుండి చూసుకోవాల్సి ఉంటుంది. పశువుల విషయంలో అప్రమత్తంగా ఉండక పోతే అనర్థాలు సంభవించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎండలు తీవ్రరూపం దాల్చడంతో మూగజీవాలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఒక్కోసారి మృత్యువాత కూడా పడతాయి. పశువులు వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన మెళకువలు, చికిత్స వివరాలను పశువైద్యాధికారులు వివరించారు.

వడదెబ్బ

వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు మెదడులో హైపోథలామస్ అనే భాగం స్వేద గ్రంథులు చెమటను అధికంగా ఉత్పత్తి చేస్తాయి. చెమట ద్వారా శరీరంలోని ధాతువులు కోల్పోయి జీవక్రియ దెబ్బ తింటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి శ్వాస, గుండె, నాడి, మూత్ర పిండాల విధులు తగ్గిపోయి పశువుల ఆరోగ్యం విషమంగా మారుతుంది. శ్వాస సరిగా అందక మరణించే అవకాశాలు లేకపోలేదు.

లక్షణాలు

పశువులలో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్ మించితే చర్మం మృదుత్వం తగ్గిపోయి, గట్టి పడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంకట చొంగ కారడం జరుగుతుంది. ఆవుల్లో పాల దిగుబడి పునరుత్పత్తి, గర్భస్రావం అయ్యే అవకాశం ఉండగా, ఎత్తులో వంధత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువైనప్పుడు పక్షవాతం, లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లి మరణిస్తాయి.

కారణాలు

- గాలిలో తేమ అధికంగా ఉండటం
- వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగటం
- పాకలో సామర్థ్యానికి మించి పశువులు ఉండటం
- నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు



- వడగాలులతో పశువులు ఒత్తిడికి లోను కావడం వల్ల

చికిత్స

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే నీడ ప్రాంతంలోకి మార్చి వీలైతే ఫ్యాన్‌లు లేదా కూలర్ల సాయంతో చల్లని గాలిని అందించాలి. బాగా ఎండగా ఉన్న సమయంలో పశువులను చల్లని నీటితో పలు మార్లు కడగాలి. నీటిని తాగడానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి మందును వాడాలి.

నివారణ చర్యలు

- వేసవిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పశువులను మేతకు బయటకు వదలకూడదు.
- చల్లని నీరు తాగేందుకు పాకాలో అందుబాటులో ఉంచాలి.
- రోజుకు 3 లేదా 4 సార్లు చల్లని నీటితో పశువులను కడగాలి. లేదా చెరువులలో నీరు నిల్వ ఉన్న కుంటలలో పశువులను వదలాలి.
- కొట్టాలను బాగా ఎత్తుగా నిర్మించుకొని పైన ఎండుగడ్డితో కప్పాలి. ఎండ ఉన్న సమయంలో పశువులపై నీటిని చల్లుతుండాలి.
- పశువుల పాకలో వడగాలి వీస్తున్న దిక్కులలో గోనే సంచులను కట్టి నీరు చల్లుతుండాలి.
- నీటి శాతం అధికంగా ఉన్న పచ్చి మేతను పశువులకు వేయాలి.
- ఎక్కువగా దాణా లేదా ఉడికించిన ధాన్యాలను పెడుతున్నప్పుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండ వేడిమికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యను నివారించవచ్చు.

ఆమ్దాని ఘనం.. సౌకర్యాలు శూన్యం

- అద్దె భవనాల్లో సర్కారు సేవలు
- నిర్మాణానికి నోచుకొని సబ్‌రిజిస్ట్రార్, గనులశాఖ కార్యాలయాలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు

తాండూరు: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ప్రభుత్వ కార్యాలయాల పనితీరు. సర్కారుకు ఏటా రూ.కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తున్న ప్రభుత్వ శాఖలకు తాండూరులో సొంత గూడు లేకుండా పోయాయి. పట్టణంలో ప్రభుత్వ భవనాలు పదుల సంఖ్యలో వృథాగా ఉన్నా అద్దె భవనాలలోనే అధికారులు కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. తాండూరు పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్, గనులశాఖ, ఎక్సైజ్ శాఖల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. కానీ వీటికి సొంత భవనాలు మాత్రం లేవు. విపత్కర సమయంలో ఉపయోగపడే అగ్నిమాపక శాఖకు సైతం శాశ్వత భవనం లేకపోవడం గమనార్హం.

శంకుస్థాపన చేసినా..

తాండూరు పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు లేక దశాబ్దాలుగా అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా తాండూరు సబ్ రిజిస్ట్రార్, ఎక్సైజ్, గనుల శాఖ, కార్మిక శాఖ కార్యాలయం లాంటివి ఇప్పటికి అద్దె భవనాల్లోనే సేవలు అందిస్తున్నాయి. అవి కూడా రెసిడెన్షియల్ ఇళ్ల మధ్యలో కార్యాలయాలున్నాయి. గత ప్రభుత్వాలు సొంత భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటివరకు నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు.



అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

20 ఏళ్లు గడుస్తోంది

స్థానికంగా సబ్ రిజిస్ట్రార్, గనుల శాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చర్యలు తీసుకున్నారు. మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సబ్‌రిజిస్ట్రార్, గనులశాఖ కార్యాలయాలకు నాటి ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. కానీ ఇప్పటివరకు ప్రభుత్వ భవనాలను నిర్మించలేకపోయారు. ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. దీంతో సిబ్బందితో పాటు, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. అధికారుల చిత్తశుద్ధి లోపం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో పనులు కొనసాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఎక్సైజ్ శాఖ ద్వారా ఏటా తాండూరు నుంచి రూ.200 కోట్ల ఆదాయం సమకూరుతోంది. కానీ ఎక్సైజ్ శాఖ కార్యాలయ భవనం మాత్రం ఇప్పటికి ఇళ్ల మధ్యనే కొనసాగుతుంది.

చిన్న గదుల్లోనే..

సంవత్సరానికి సబ్‌రిజిస్ట్రార్, గనులశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. భవన నిర్మాణానికి నిధులు పుష్కలంగా ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వంతో పనులు ప్రారంభం కావడం లేదు. రైల్వేస్టేషన్ సమీపంలో అద్దె భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చిన్న గదులతో ఉండటంతో సిబ్బందికే సరిపోవడం లేదు. దీంతో స్థానికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గనులశాఖ కార్యాలయం కూడా అంతే. చిన్న గదుల్లోనే ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..

కీసర: కొద్దిసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. దైవ దర్శనం చేసుకుని వెళ్లి వస్తుండగా మృత్యువు కబళించింది. కీసరలోని ఓఆర్‌ఆర్‌పై ఆదివారం జరిగిన ఘోర ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. కీసర సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లికి చెందిన యశ్వంత్ (25), పీర్జాదిగూడకు చెందిన చార్లెస్(25), ఎల్‌బీ నగర్‌కు చెందిన చెన్నకేశవ గౌడ్(23), వివేక్, సురేష్, యశ్వంత్ నాయక్ శనివారం ఉదయం కారులో కర్ణాటక బీదర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి వెళ్లారు. అనంతరం ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. యశ్వంత్ కారు నడుపుతుండగా, చార్లెస్ ముందు సీట్లో కూర్చున్నాడు. మిగతావారు వెనక సీటులో ఉన్నారు. ఉదయం 11:15 గంటలకు ఓఆర్‌ఆర్‌పై కీసర ఎగ్జిట్ దాటిన తర్వాత ముందున్న గ్యాస్ కంటెయినర్ లారీని కారు ఢీకొట్టి, డివైడర్‌కు తగిలింది. ఈ ఘటనలో యశ్వంత్‌తో పాటు చార్లెస్ అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నకేశవ గౌడ్ తీవ్రంగా గాయపడటంతో వైద్యం కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చేర్పించారు.

ఉప్పల్ రింగ్ రోడ్డులో కారు దగ్ధం

ఉప్పల్: ఉప్పల్ రింగ్ రోడ్డులోని వరంగల్ బస్టాప్‌లో కారు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ కుమారుడు ప్రవీణ్ గౌడ్, తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం ఉప్పల్‌లోని డీఎస్‌ఎల్ మాల్‌లో షాపింగ్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉప్పల్ రింగ్ రోడ్డు వరంగల్ బస్టాప్ వద్దకు చేరుకోగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన వారు కారు లోంచి దిగి బయటికి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసినా వారు సకాలంలో స్పందించకపోవడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ కారణంగా ఉప్పల్‌లో భారాగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో వాహనాన్ని అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వినోద్‌కుమార్

- ప్రొఫెసర్ వినోద్‌కుమార్
- ఏర్పుమళ్లలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బొంరాస్‌పేట: శాస్త్ర సాంకేతికత రంగం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో సైతం గ్రామాల్లో కుల వివక్ష ఉండడం అత్యంత దారుణమని ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని ఏర్పుమళ్లలో డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏర్పుమళ్లలోనూ రెండు గ్లాసుల విధానం, దళితులకు క్షౌవరం చేయకపోవడం బాధాకరమన్నారు. అంటరానితనం ఏ రూపంలో ఉన్నా నిర్మూలించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో దళితులు, పేదల భూములు కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి జుడీషియల్ కమిటీ వేసి కాపాడాలని ఆయన కోరారు. వక్తలు కట్టెల మల్లేశం, బైరెడ్డి సతీష్, కాంగ్రెస్ పార్టీ జాతీయ యూత్ కోఆర్డినేటర్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొని స్థానికులకు చైతన్య పరిచారు. అంతకుముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ధూంధాం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌బాబు, సూర్యానాయక్, వెంకటయ్య, చంద్రయ్య, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

నాంపల్లి: కారు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మణికంఠ(24) అనే యువకుడు జొమోటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున అతను అమీర్‌పేట నుండి మెహిదీపట్నం వైపు వెళుతుండగా మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజా మెన్షన్ హాల్ సమీపంలో గుర్తు తెలియని కారు అతడిని ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


మోతి బాయ్(102)

శంకర్‌పల్లి: శతాధిక వృద్ధురాలు మృతి చెందారు. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన కటికె మోతి బాయ్(102) ఆదివారం అనారోగ్యంతో తుదిశ్వాస వీడారు. వంద సంవత్సరాలు జీవించిన బామ్మను కడసారిగా చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. ఆమె మనుమడు సతీశ్ మాట్లాడుతూ.. వందేళ్ల వయస్సులోనూ అమ్మమ్మ ఎంతో హుషారుగా ఉండేదని, చిరుతిండికి అయిష్టత చూపేదని పేర్కొన్నారు.

'ఫోన్ ట్యాపింగ్' శ్రవణ్‌రావుపై మరో కేసు

- ఇనుప ఖనిజం ఇప్పిస్తానంటూ మోసం
- అఖండ సంస్థ ఫిర్యాదు మేరకు రిజిస్టర్
- నిందితుల్లో శ్రవణ్ భార్య మరికొందరు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఓ మీడియా సంస్థ యజమాని శ్రవణ్ కుమార్ రావుపై హైదరాబాద్‌లో మరో కేసు నమోదైంది. ఇనుప ఖనిజం వ్యాపారం డీల్ ఇప్పిస్తానంటూ మోసం చేశారని అఖండ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా సంస్థ ఎండీ ఎ.ఆకర్ష్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు దీనిని రిజిస్టర్ చేశారు. రూ.6.5 కోట్ల గోల్‌మాల్‌తో ముడిపడి ఉన్న ఈ కేసులో శ్రవణ్‌రావుతో పాటు ఆయన భార్య స్వాతి రావు, వ్యాపార భాగస్వామి కేబీ వేదమూర్తి, ఎకోర్ ఇండస్ట్రీస్ హోల్‌టైమ్ డైరెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి నిందితులుగా ఉన్నారు. గత నెల 25నే ఈ కేసు నమోదైనప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్రిధమ్ ఎనర్జీ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న శ్రవణ్‌రావు 2022 జూన్‌లో ఆకర్ష్‌ను సంప్రదించాడు. కర్ణాటక, సాండూర్‌లో ఉన్న ఎకోర్ ఇండస్ట్రీస్ బాధ్యతల్ని తాను స్వీకరించినట్లు చెప్పాడు. ఇనుప ఖనిజం వ్యాపారంలో ఉన్న తమకు నిధులు సమకూరిస్తే ప్రతి టన్నుకు రూ.300 చొప్పున లాభం ఇస్తానంటూ నమ్మబలికాడు. దీంతో అఖండ సంస్థ 2022 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వివిధ దఫాలుగా ఎరోర్ సంస్థ ఖాతాల్లోకి రూ.6.5 కోట్లు బదిలీ చేసింది. ఈ చెల్లింపులకు సంబంధించి ఎకోర్ సంస్థ నుంచి తమకు ఎలాంటి ఇన్వాయిస్‌లు అందలేదని ఆకర్ష్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. 2023 నాటికి సంబంధిత వ్యక్తులకు రూ.7 కోట్ల విలువైన ఇనుప ఖనిజం సరఫరా జరగాల్సి ఉండగా... అలా చేయకపోవడంతో ఆకర్ష్‌కు అనుమానం వచ్చింది. దీంతో ఆరా తీసిన ఆయన తమ సంస్థ బదిలీ చేసిన నిధుల్ని శ్రవణ్‌రావు వేరే అవసరాలకు మళ్లించినట్లు గుర్తించారు. దీనిపై పలుమార్లు ప్రశ్నించినా శ్రవణ్‌రావు నుంచి సరైన సమాధానం రాలేదు. కొన్ని రోజులకు శ్రవణ్‌రావు విదేశాలకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆకర్ష్ తన నిధులకు సంబంధించి శ్రవణ్ భార్య స్వాతితో పాటు వేదమూర్తిని పలుమార్లు సంప్రదించాడు. గత ఏడాది సెప్టెంబర్ వరకు వారు కేవలం రూ.50 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించారు. గత నెల వరకు ఎదురు చూసిన ఆకర్ష్ దీనిపై సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుతో పాటు బాధితుడు అనేక వాట్సాప్ చాటింగ్స్, ఈ–మెయిల్స్ ప్రతులకు జత చేశాడు. ఈ కేసును అధికారులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్@255 కోట్లు

క్రమబద్ధీకరణకు విశేష స్పందన

- ముగిసిన రాయితీ గడువు


తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు విశేష స్పందన లభించింది. ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించడంతో దరఖాస్తు దారులు చాలా మంది రుసుం చెల్లించారు. తొలుత మార్చి 31 వరకు రాయితీతో కూడిన గడువు ప్రకటించినప్పటికీ.. తరువాత మరో నెల, అనంతరం మే 3వ తేది వరకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీ స్థలాల యజమానులు ముందుకు రావడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.

రూ.255.56 కోట్ల ఆదాయం

జిల్లాలోని 14 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల పరిధి నుంచి 2020 సంవత్సరంలో 2లక్షల 55వేల 923 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో లక్షా 78వేల 591 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని అధికారులు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందజేశారు. దీంతో 65వేల 186 మంది రుసుం చెల్లించారు. దీంతో ప్రభుత్వానికి రూ.255 కోట్ల 56 లక్షల ఆదాయం వచ్చింది. అత్యధిక దరఖాస్తులు తుర్కయంజాల్ నుంచి 54,331 వచ్చినప్పటికీ, ఆదాయం మాత్రం పెద్ద అంబర్‌పేట నుంచి రూ.53 కోట్ల 85 లక్షలు వచ్చింది. బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి రూ.48 కోట్ల 45లక్షలు వచ్చాయి. అత్యల్పంగా శంషాబాద్ మున్సిపాలిటీలో 10,086 అర్జీలు వచ్చినప్పటికీ 111జీఓ పరిధిలో ఉండటంతో కేవలం 270 మందిని మాత్రమే అర్హులుగా పేర్కొంటూ రుసుం చెల్లించాలని సూచించారు. ఇందులో 151 మంది రూ.ఒక కోటి 59 లక్షలు చెల్లించారు.

మరో అవకాశం కల్పిస్తే..

ప్రభుత్వం రాయితీ ప్రకటించిన నాటి నుంచి ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు భారీగా ప్రచారం చేశారు. ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించారు. సులభంగా అర్థమయ్యేలా మొబైల్‌లో ఫైల్ స్టేటస్ చెక్ చేసుకోవడంతో పాటు, డబ్బులు చెల్లించే వెసులుబాటు కల్పించారు. దీంతో చాలా మంది రుసం చెల్లించారు. ప్రభుత్వం గడువు మరింత పెంచి, రాయితీ కల్పిస్తే మరికొందరు ఫీజు చెల్లించే అవకాశాలు ఉంటాయి.

ప్రొసీడింగ్స్‌కు వేచి ఉండాల్సిందే

పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో భారీగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినప్పటికీ.. వీటి పరిశీలనకు వేచి చూడక తప్పని పరిస్థితి. వారం క్రితం వరకు దరఖాస్తులను కేవలం టౌన్ ప్లానింగ్ అధికారులు అప్రూవల్ చేస్తే సరిపోయేది. కానీ తిరిగి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అంగీకారం కూడా కావాల్సి ఉంది. దీంతో అత్యధికంగా ఫీజులు చెల్లించిన చోట ఇబ్బందులు తప్పేలా లేవు. మూడు శాఖల అధికారులు ధ్రువీకరించి, ఆమోదం తెలిపితే ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ పొందవచ్చు.


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

రైతులు ఆందోళన చెందొద్దు

- తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: అన్నదాతలు ఆందోళన చెందవద్దు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, న్యాయం చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కురిసిన వానకు ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కుప్పలుగా పోసిన వడ్లు తడిసిపోగా.. ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన వడ్లను కొనుగోలు చేస్తామని చెప్పారు.

విపక్షాల రాజకీయం

ఏనాడు రైతు సంక్షేమం పట్టని విపక్షాలు.. అకాలవర్షానికి ధాన్యం తడిస్తే.. దానిని రాజకీయం చేస్తూ, పబ్బం గడుపుకొనే యత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న ఆ పార్టీ.. రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2 లక్షలు మాఫీ చేసిందని పేర్కొన్నారు. సన్నాలకు అదనంగా క్వింటాకు రూ.500 అందిస్తున్నామని చెప్పారు. వ్యవ సాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించి ఆదుకున్నది కాంగ్రెస్ పార్టేనన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తలకొండపల్లి సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, పాండు రంగయ్య, రవీందర్, అజీం, రమేశ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు ఖలీల్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్, బాబా, శ్రీపాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- బంగారం, నగదు చోరీ

అల్వాల్: వృద్ధ దంపతులను దారుణంగా హత్య చేసి ఒంటిపై ఉన్న బంగారు నగలతో పాటు, ఇంట్లో ఉన్న నగదు ఎత్తుకెళ్లిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూర్యనగర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, మాణిక్యారం గ్రామానికి చెందిన కనకయ్య (70), రాజమ్మ (65) దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారికి పెళ్లిళ్లు కావడంతో బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి స్థిరపడ్డారు. ఊరిలో వ్యవసాయం చేసుకునే కనకయ్య, రాజమ్మ వయసు మీద పడడంతో పిల్లల వద్ద ఉందామనే ఆలోచనతో మూడేళ్ల క్రితం నగరానికి వచ్చారు. కనకయ్య అల్వాల్, సూర్యనగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. కొన్నాళ్ల క్రితం అతను అనారోగ్యానికి గురి కావడంతో ఊరికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సమీపంలో ఉంటున్న కూతురు లత ఇంటికి వెళ్లి సామన్లు సర్దుకునేందుకు అవసరమైన సంచులు కూడా తెచ్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున వారి కుమార్తె లత ఇంటికి వచ్చి చూడగా తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో మంచంపై విగతజీవులై పడి ఉన్నారు. ఇద్దరి తలలపై గాయాలు ఉన్నాయి. సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. లత కేకలు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాగిలాలను రప్పించి పరిసరాల్లో తనిఖీలు చేశారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి ఇంట్లో చొరబడి దొంగతనాలు పాల్పడి ఉంటారని, ఈ క్రమంలోనే వారిపై దాడి చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. రాజమ్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, వెండి పట్టీలు, రూ. లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కనకయ్య తమ వద్ద ఉన్న నగదు అవసరమైన వారికి వడ్డీకి ఇచ్చే వాడని తాను ఊరికి వెళ్లి రూ. లక్ష తీసుకువచ్చానని, అవసరం ఉన్న వారికి వడ్డీకి ఇస్తానని చెప్పినట్లు స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న బాలానగర్ డీసీపీ సుధీర్ కుమార్, ఏసీపీ రాములు, సీఐ రాహుల్‌దేవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు సంబంధించిన కొన్ని ఆధారాలు లభించాయని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జీడిమెట్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ అపార్ట్‌మెంట్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మి(25)కి గత డిసెంబర్‌లో హరికృష్ణతో వివాహం జరిగింది. భార్యాభర్తలు సుభాష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివా సం ఉంటున్నారు. హరికృష్ణ ఓ ప్రైవేట్ పరిశ్రమలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం లక్ష్మి తాము ఉంటున్న అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుంచి కిందకు దూకింది. దీనిని గుర్తించిన అపార్ట్‌మెంట్ వాసులు అక్కడకు వెళ్లి చూడగా తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా లక్ష్మికి పెళ్లి ఇష్టం లేని కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని సమాచారం. మృతురాలి తల్లిదండ్రుల వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి


గాయపడిన అవదేశ్ కుమార్ వర్మ

మల్లాపూర్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అవదేశ్ కుమార్ వర్మ(50), బాబు రామ్ వర్మ(55) నగరానికి వలస వచ్చి మల్లాపూర్ వీఎన్‌ఆర్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బాబురామ్ వర్మ అదను కోసం ఎదురు చూస్తున్నాడు. ఇందుకుగాను కొబ్బరి కాయలు కొట్టే కత్తిని కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఆదివారం ఉదయం అతను అవదేశ్ కుమార్ వర్మపై కత్తితో దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని నాచారం ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అవదేశ్ కుమార్ వర్మ ఆరోగ్య నిలకడగానే ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేనకోడలే మాస్టర్ మైండ్

- మేనత్త ఇంట్లో దోపిడీ చేయించిన వైనం
- అద్దె పేరుతో ఇంట్లోకి చొరబడి చోరీ
- మేనకోడలితో పాటు మరో ఇద్దరు నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

సికింద్రాబాద్: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలైన మేనత్తను టార్గెట్ చేసి ఆమె ఇంట్లో దోపిడీ చేయించిన మేనకోడలి ఉదంతమిదీ. ఇల్లు అద్దెకు కావాలన్న నెపంతో వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు ఆగంతకులు ఆమెను బంధించి నగలు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసులో మిస్టరీ వీడింది. ఈ దారుణానికి పాల్పడిన ఇద్దరు ఆగంతకులతో పాటు సూత్రధారిగా వ్యవహరించిన బాధితురాలి మేనకోడలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ముగ్గురినీ రిమాండ్‌కు తరలించారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ పార్శిగుట్టలో పారిజాతం (60) అనే మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఈనెల 2న మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు ఇల్లు అద్దెకు కావాలంటూ పారిజాతం ఉంటున్న మొదటి అంతస్తుకు వచ్చారు. ఆమె తేరుకునే లోపే ఇంట్లోకి చొరబడి తలుపులు గడియపెట్టి ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి తాడుతో కట్టేశారు. నోటికి ప్లాస్టర్ వేసి సెల్‌ఫోన్, రూ.6వేల నగలు, 30 గ్రాముల బంగారు ఆభరణాలను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. దొంగలు వెళ్లిపోయిన తర్వాత కట్లు విప్పుకుని బయటికి వచ్చిన పారిజాతం స్థానికుల సహాయంతో వారాసీగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా...

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. ముషీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్న శ్రీకాంత్, బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ ఈశ్వర్‌లను నిందితులుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తమ బంధువు పార్శిగుట్టకు చెందిన క్యాటరింగ్ వర్కర్ ఆళ్ల జ్యోతి సూచన మేరకే తాము పారిజాతం ఇంట్లో దోపిడీకి పాల్పడినట్లు నిందితులు వెల్లడించారు. దీంతో జ్యోతిని అదుపులోకి తీసుకుని విచారించగా తన మేనత్త ఒంటరిగా ఉంటున్న విషయం తనకు తెలుసునని డబ్బు కోసమే శ్రీకాంత్‌ను దోపిడీకి పురమాయించినట్లు తెలిపింది. నిందితుల నుంచి సెల్‌ఫోన్, నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేవలం డబ్బు కోసం మాత్రమే వీరు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వారికి ఎలాంటి నేరచరిత్ర లేదన్నారు. రెండు రోజుల్లోనే కేసును చేధించి నిందితులను అదుపులోకి తీసుకున్న ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్ఐలు సుధాకర్, ప్రకాశ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు గాలేబ్, దస్తగిరి, వేణు, రామకృష్ణ తదితరులకు డీసీపీ అవార్డులు అందజేశారు.

తగ్గిన ఎండలు

- పెరిగిన పర్యాటకుల సందడి

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కోట్‌పలి ప్రాజెక్టుకు ఆదివారం తక్కువ సంఖ్యలో పర్యాటకులు రావడం జరిగింది. ఒకటి, రెండు కుటుంబాలు మాత్రమే వచ్చివెళ్లారు. కొంతమంది యువత వచ్చి బోటింగ్ చేసి వెనుదిరిగారు. కొందరు ప్రాజెక్టు పరిసరాల్లో చెట్ల కింద కూర్చుని సేదతీరారు.


ప్రాజెక్టు ఒడ్డున ఫొటో దిగుతున్న ఓ యువతి


పైడిల్ బోటింగ్ చేస్తున్న కుటుంబం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

అనంతగిరి: గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కులలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానిక బూత్ కమిటీ అధ్యక్షులు సుద్దగళ్ల లింగమయ్య, మైస నరేష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సదానందరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులను ఇస్తుందన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషితో మరిన్ని నిధులు తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు, రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శి నవీన్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్, యువకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

- చార్జింగ్ పెట్టుకునేందుకు వచ్చి రూ.35వేలు అపహరణ


సెల్‌ఫోన్ దుకాణంలో డబ్బులను చోరీ చేస్తున్న గుర్తు తెలియని యువకుడు

తాండూరు: సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకొనేందుకు వచ్చిన యువకుడు కౌంటర్‌పై ఉంచిన రూ.35వేలు తీసుకొని ఉడాయించిన సంఘటన తాండూరు పట్టణంలో ఆదివారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు పట్టణంలోని కొడంగల్ రోడ్డు మార్గంలో తాండూరుకు చెందిన ఓ వ్యాపారి ఒప్పో స్టోర్‌ను నిర్వహిస్తున్నాడు. షాప్ చూసుకోవాలని దుకాణంలో పని చేసే యువకుడికి చెప్పి బయటకు వెళ్లాడు. అప్పుడే ఓ వ్యక్తి ఫోన్ కొనేందుకు వచ్చాడు. వచ్చిన వ్యక్తికి రూ.35వేల ఫోన్‌ను విక్రయించాడు. వచ్చిన డబ్బులను క్యాష్ కౌంటర్‌లో పెడదామంటే తాళం వేసి ఉంది. దీంతో అతను కౌంటర్‌పైనే ఒక అరలో డబ్బులను పెట్టి వ్యాపారంపై దృష్టి పెట్టాడు. అప్పుడే ఓ యువకుడు సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకొనేందుకు వచ్చాడు. చార్జింగ్ పెట్టి ఫోన్ మాట్లాడుతూ.. ఎవరు లేని సమయం చూసి కౌంటర్‌పై ఉన్న రూ.35వేలను తీసుకొని మెల్లగా షాపులో నుంచి వెళ్లిపోయాడు. కొంత సేపటి తర్వాత షాపులో పని చేస్తున్న వ్యక్తి డబ్బులను చూసుకోగా కనిపించలేదు. దీంతో అతను డబ్బులు ఎత్తుకెళ్లారని గుర్తించి సీసీ కెమెరాలు చెక్ చేశాడు. అందులో సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టుకొనేందుకు వచ్చిన గుర్తు తెలియని యువకుడు ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఈ విషయం గురించి యజమాని వచ్చాక వివరించి చెప్పాడు. ఇద్దరు కలిసి వెళ్లి పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: లారీ ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా ఝరాసంగం మండలం ఈదులపల్లి గ్రామానికి చెందిన బండి వినేష్‌కుమార్(30) ఆదివారం ఉదయం 11.45 గంటలకు పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు కూడలి సమీపంలో విజయవాడ జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ సమయంలో పుణే నుంచి ఒడిస్సా వైపునకు వెళ్తున్న ఓ లారీ వినేష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలై.. అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

రైతులు జాగ్రత్త!


షాబాద్‌లో విక్రయానికి సిద్ధంగా వరి విత్తనాల సంచులు

విత్తనాల కొనుగోలులో అప్రమత్తం కావాలి

- దుకాణదారులు నిబంధనలు పాటించాలి
- షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం



షాబాద్: విత్తన కొనుగోలులో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచించారు. వానాకాలం సీజన్(ఖరీఫ్) ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు వహించాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం అన్నారు. ఫర్టిలైజర్ దుకాణదారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. విత్తన విక్రయ దుకాణాలపై నిఘా ఉంచామని, ఆకస్మిక తనిఖీలు చేసి, రికార్డులు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. విక్రేతలతో మాట్లాడి నిబంధనలు కచ్చితంగా పాటించాలని, తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమతి పొందిన షాపు నుంచే..

వ్యవసాయ శాఖ అనుమతి పొందిన షాపుల నుంచే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకొని, భద్రపర్చుకోవాలి. రసీదుపై విత్తన కంపెనీ నంబర్, తయారీ, ముగింపు తేదీలు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. బిల్లులపై దుకాణం ముద్ర ఉండేలా చూసుకోవాలి. విత్తనాల మొలక శాతం, తేమ శాతం కచ్చితంగా దుకాణదారులను అడగాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలున్నా, తడిసినా కొనవద్దు. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతం చూసుకోవాలి. ఆ సంచులపై ప్రామాణికాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉన్నప్పుడు కొనాలి.

నిబంధనలు తప్పనిసరి

దుకాణం ఎదుట ధరల వివరాలు బోర్డుపై పొందుపరచాలి. లభించే విత్తనాల రకాలు, డీలర్ల వివరాలను పేర్కొనాలి. షాపు లైసెన్స్ వినియోగదారులకు కనిపించేలా ఉంచాలి. స్టాక్, విత్తన వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలి. విత్తనాలు, ఎరువుల విక్రయాలు, కంపెనీల పూర్తి వివరాలను నిత్యం వ్యవసాయశాఖకు తెలపాలి.

బాలుడిపై లైంగిక దాడి కేసులో యువతి రిమాండ్

బంజారాహిల్స్: ఆ బాలుడికి 16 ఏళ్లు. అతడి తల్లిదండ్రులు జూబ్లీహిల్స్‌లోని ఓ బడా పారిశ్రామికవేత్త ఇంట్లో పని చేస్తూ అక్కడే ఉన్న సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. సదరు బాలుడు పదో తరగతి పరీక్షల కోసం గత జనవరిలో తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అదే ఇంట్లో పని మనిషిగా పనిచేస్తున్న మరో యువతి (28) వారు ఉంటున్న క్వార్టర్ పక్కనే మరో క్వార్టర్‌లో ఉంటోంది. ఆ బాలుడితో పరిచయం పెంచుకున్న ఆమె తరచూ అతడిని తన క్వార్టర్‌లోకి పిలిపించుకుని అతడిపై లైంగిక దాడికి పాల్పడేది. ఈ విషయం ఎవరికైనా చెబితే నీ తల్లి మీద దొంగతనం కేసు పెట్టించి ఉద్యోగం నుంచి తీసివేయిస్తానని బాలుడిని బెదిరించేది. తన తల్లి ఉద్యోగం పోతుందనే భయంతోనే అతను ఈ విషయం ఎక్కడా చెప్పలేదు. ఐదు రోజుల క్రితం సదరు యువతి గదిలో తన కుమారుడు ఉండడాన్ని గుర్తించిన అతడి తల్లి అక్కడికి వెళ్లి చూడగా సదరు యువతి తన కొడుకును బలవంతంగా ముద్దు పెట్టుకుంటుండగా చూసింది.ఈ విషయమై తన కుమారుడిని నిలదీయగా అతను తల్లికి పూర్తి వివరాలు చెప్పాడు. దీంతో బాధితుడి తల్లి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు లైంగిక దాడికి పాల్పడిన యువతిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.